రైతులకు అగ్రిటెక్ దక్షిణాది సదస్సు

- వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమాదేవి
- హాజరు కానున్న మఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి

వికారాబాద్, ఫిబ్రవరి 15 : భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 16 నుంచి 18 వరకు రైతులకు అగ్రిటెక్ దక్షిణాది సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి హాజరు కానున్నారని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణ, రైతుల ఆదాయం రెట్టింపు, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులు, యంత్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. రైతులందరికీ ఉచిత ప్రవేశం ఉన్నందున ఈ సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనవలసినదిగా కోరారు.

50,540 ఎకరాల్లో వరి నాట్లు

వికారాబాద్ జిల్లాలో సుమారు 50,540 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారని రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వరి పైర్లు కొన్ని చోట్ల నారుమడి దశలోనూ, మరికొన్ని ప్రాంతాల్లో పిలక దశలోనూ ఉన్నాయని.. ఈ యాసంగిలో కూడా నారుమడి, పిలక దశల్లో కాండం తొలిచే పురుగు, రెక్కల పురుగుల ఉధృతి అధికంగా ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. నారుమడి దశలో కూడా కాండం తొలిచే పురుగు నష్టపరుస్తుంది గనుక నారు మడిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా 600 గ్రా. పిప్రోనిల్ 0.3జి గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయస్సున్న, పిలక దశలో ఉన్న వరి పైరులో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు 20-25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలి. అలాగే మొగి పురుగు/కాండం తొలిచే పురుగు నివారణకు సిఫారసు చేయబడని ఇతర 10జి లేదా సేంద్రియ గుళికలను యూరియాతో కలిపి వేయడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతులు గమనించాలని పేర్కొన్నారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాలరాజు

ఆమనగల్లు, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. ఆమనగల్లు మండలంలోని వివిధ తండాల్లో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో సంత్ సేవాలాల్ విగ్రహం వద్ద సేవాలాల్ 285వ జయంతి వేడుకలను నిర్వహించగా.. గువ్వల బాలరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భోగ్ భండార్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం సేవాలాల్ చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. ఆయన బోధనలను అందరూ ఆచరించాలని సూచించారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు. ఆమనగల్లు మండలంలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1-15 గుంటల భూమిలో కోటి రూపాయలతో గిరిజన భవనాన్ని నిర్మించుటకు నిధులు మంజూరు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నేనావత్ అనురాధ, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు పత్యా నాయక్, మాజీ ఎంపీటీసీ సరిత, మాజీ సర్పంచ్ శోభ, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్

సంప్రదాయ చేతి వృత్తుల వారిని ప్రోత్సహించాలి

- జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకంపై జిల్లాస్థాయి అవగాహన సదస్సు

వికారాబాద్, ఫిబ్రవరి 15 : సంప్రదాయ చేతి వృత్తులవారిని, హస్త కళాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ.. వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పీఎం విశ్వకర్మ పథకంపై ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ పథకం ఉద్దేశాలు, ప్రయోజనాలను అయన వివరిస్తూ.. అర్హులైన విశ్వకర్మలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు మీసేవ కేంద్రాలు లేదా గ్రామపంచాయతీ కార్యాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, బ్యాంకు వివరాలతో పాటు రేషన్ కార్డు వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

స్వయం ఉపాధి ఏర్పర్చుకోవాలనుకునే వారికి ఉపయుక్తం

కమ్మరులు, స్వర్ణకారులు, వడ్రంగులు, శిల్పులు, స్వర్ణకారులు, చెప్పులు కుట్టేవారు, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసే వారు, దర్జీలు, చేపల వలలు తయారు చేసే వారు, పూలదండలు తయారు చేసేవారు, చర్మకారులు, రజకులు, ఆయుధాలు తయారు చేసేవారు, చేతి వృత్తులు, హస్త కళా కారులు వంటి 18 కేటగిరీలలో పని చేస్తున్న వారు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా స్వయం ఉపాధి ఏర్పర్చుకోవాలనుకునే చేతి వృత్తిదారులు, హస్త కళాకారులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న ఏ కులానికి సంబంధించిన వారైనా సరే ఈ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. పీ.ఎం విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి నైపుణ్యం మెరుగుదల కోసం 7 రోజుల నుంచి 15 రోజుల వరకు శిక్షణ అందిస్తారని, శిక్షణా కాలంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారని వివరించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు జారీ చేస్తారన్నారు.

రెండు విడుతలుగా రుణ సాయం

లబ్ధిదారులకు రుణ సహాయం కింద రెండు విడుతలుగా మొత్తం మూడు లక్షల రూపాయలు అందిస్తారని తెలిపారు. లబ్ధిదారులు రాయితీ వడ్డీ రేటు కేవలం ఐదు శాతంపై రుణ సదుపాయం పొందవచ్చని అయన సూచించారు. విశ్వకర్మలు తయారు చేసే వస్తువులకు సరైన మార్కెటింగ్ వసతి లభించేలా ఎం.ఎస్.ఎం.ఈ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇలా అనేక ప్రయోజనాలతో కూడుకుని ఉన్న పీ.ఎం విశ్వకర్మ పథకం గురించి గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, అర్హులైన ప్రతిఒక్కరూ ప్రయోజనం పొందేలా చొరవ చూపాలని సి.ఎస్.సి కేంద్రాల ఆపరేటర్లు, గ్రామపంచాయతీల కార్యదర్శులను కోరారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ తేదీ నాటికి 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. గత ఐదేండ్లలో స్వయం ఉపాధి/వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రుణాలు పొందినవారు ఈ పథకానికి అర్హులు కాదన్నారు. ముద్ర, స్వనిధి పథకాల లబ్ధిదారులు తమ రుణాలను చెల్లించినట్లైతే ఈ విశ్వకర్మ పథకానికి అర్హులని తెలిపారు. ఈ పథకం కుటుంబంలోని ఒకరికి మాత్రమే వర్తిస్తుందని, ప్రభుత్వ సర్వీసులో ఉన్న వ్యక్తికి/కుటుంబసభ్యులకు ఈ పథకం వర్తించదన్నారు. సదస్సులో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుధీర్‌కుమార్, ఎస్‌బీఐ రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ (క్రెడిట్) వికాస్ సాహూ, ఎల్‌డీఎం రాంబాబు, మెప్మా పీడీ రవికుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి భీమ్‌రాజు, సీఏస్‌సీ ఆపరేటర్లు, ఔత్సాహిక విశ్వకర్మలు, సంబంధిత అధికారులున్నారు.

సమావేశానికి హాజరైన విశ్వకర్మ సంఘం సభ్యులు, అధికారులు తదితరులు

'ప్రేరణ'తో ఉత్తమ ఫలితాలు

- జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు
- 1200 మంది విద్యార్థులకు ఉచితంగా హ్యాండ్‌బుక్‌ల పంపిణీ

టీచర్స్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో సుశీందర్‌రావు తదితరులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 15 : ఉత్తమ ఫలితాలకు 'ప్రేరణ' వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 20 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డీడీఎల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రేరణ పేరిట గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుశీందర్‌రావు, గౌరవ అతిథిగా ఇంపాక్ట్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు, డీడీఎల్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌బాబు హాజరయ్యారు. విద్యార్థుల కోసం నిపుణులతో ప్రత్యేకంగా రూపొందించిన టీచర్స్ హ్యాండ్‌బుక్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 1200 మంది విద్యార్థులకు ఉచితంగా హ్యాండ్‌బుక్‌లను పంపిణీ చేశారు. అనంతరం సుశీందర్‌రావు మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఇలాంటి ప్రేరణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పరీక్షలకు కేవలం నెల సమయమే ఉన్నందున ఆ టైంను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఒత్తిడిని ఎలా దూరం చేసుకోవాలి, ఎలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలో గంప నాగేశ్వర్‌రావు వివరించారు. విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాన్ని ఎలా బయటపెట్టాలో చెప్పారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకట్‌రెడ్డి, హీర్యానాయక్, ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, దశరథ రాంరెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్‌గౌడ్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు కిశోర్, రాంబాబు, శ్రీధర్, సుశీల్, సంతోష్, ప్రసాద్, శాంతారాంప్రసాద్, అభిరాం, అభిషేక్, రాంబాబు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పల్స్ పోలియోపై శిక్షణ

వికారాబాద్, ఫిబ్రవరి 15 : వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గురువారం పల్స్ పోలియో 2024 కార్యక్రమంపై జిల్లాలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లాలోని అధికారులందరికీ శిక్షణ ఇచ్చారని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ శిక్షణ ఇచ్చారని వైద్యాధికారులు తెలిపారు. జిల్లాలో హై రిస్క్ ప్రాంతాలను గుర్తించి అక్కడి పిల్లలకు కూడా చుక్కలు వేయాలని.. అలాగే బస్టాండ్, రైల్వే స్టేషన్లలో కూడా కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. బుచ్చిబాబు ఉన్నారు.

ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఎల్‌వోసీ అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 15 : సీఎంఆర్ఎఫ్ కింద రూ.2.40లక్షలు మంజూరైన పత్రాన్ని బాధిత కుటుంబానికి గురువారం హైదరాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అందజేశారు. వికారాబాద్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రేణుకాదేవి గత కొంతకాలంగా నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నారు. వారి ఆర్థిక పరిస్థితులు బాగోలేనందున వారు సీఎంఆర్ఎఫ్ కింద ఎల్‌వోసీ కి దరఖాస్తు చేసుకున్నారు. ఆర్థికంగా తమను ఆదుకున్నందుకు కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వేగం ప్రాణం తీసింది

- ఒకరు మృతి..
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

మాదాపూర్, ఫిబ్రవరి 15: ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తూ నిర్లక్ష్యం, అతి వేగంగా డ్రైవింగ్ చేసి చెట్టుకు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తెల్లవారు జామున మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన అజయ్ (27) బతుకుదెరువు కోసం వచ్చి.. విశాఖ ఇండస్ట్రీస్‌లో సేల్స్‌మన్‌గా ఉద్యోగం చేస్తూ బేగంపేటలోని పీజీ మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 15న తెల్లవారుజామున అజయ్ జగిత్యాల జిల్లాకు చెందిన మరో ఇద్దరు స్నేహితులు శ్రీపాద శరత్, అందె అజయ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ముగ్గురు మాదాపూర్‌లోని ఖానామెట్ నుంచి నోవాటెల్ వైపు బయలుదేరారు. మార్గ మధ్యలో న్యాక్ ప్రధాన గేట్ వద్ద ఉన్న 7 సిస్టర్స్ రెస్టారెంట్ దగ్గర అజయ్ ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యం, అతి వేగంతో డ్రైవింగ్ చేయడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టాడు. దీంతో అజయ్‌కి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, శరత్, అందె అజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని సమీప దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అందె అజయ్ తండ్రి అందె గణేషన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పులకు తావులేకుండా..

- గ్రామస్వరాజ్ యాప్‌తో అక్రమాలకు చెక్
- పక్కాగా గ్రామపంచాయతీ సమాచారం
- నిధులు, ఖర్చులతో సహా అన్నీ తెలుసుకునే సౌకర్యం

మొయినాబాద్, ఫిబ్రవరి 15 : కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ-గ్రామస్వరాజ్ యాప్‌తో పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టినట్లు అయ్యింది. పంచాయతీకి వచ్చే ప్రతి పైసా వివరాలు తెలిసిపోతాయి. కార్మికుల జీతభత్యాలతో సహా అభివృద్ధి పనులకు వచ్చే నిధుల వివరాలను ప్రతి ఒక్కరూ తెలుసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. గతంలో గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు, ఆదాయం ఖర్చు వివరాలను తెలుసుకోవాలంటే ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులతో ఆరా తీయాల్సి వచ్చేది. లేదా సమాచార హక్కు చట్టంతో అర్జీ పెట్టుకోవాల్సి వచ్చేది. అధికారులు ఇచ్చే సమాచారంలో స్పష్టత ఉండేది కాదు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం మూడేండ్ల కిందట ఈ-గ్రామస్వరాజ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామపంచాయతీకి సంబంధించిన లెక్కలను యాప్‌లో పక్కాగా నమోదు చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో ఈ యాప్ ద్వారా పంచాయతీ పూర్తి సమాచారాన్ని సులభంగా తెలుసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. కాగా దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో పంచాయతీ ఆదాయం, వ్యయాలను తెలుసుకోలేక పోతున్నారు.

పక్కా సమాచారం

పంచాయతీ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయడం వలన పారదర్శకత పెరుగుతుంది. పంచాయతీల్లో పారపాట్లకు తావులేకుండా ప్రతి పైసాను లెక్క ప్రకారం ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఏదైనా తప్పుడు నివేదిక చూపిస్తే ఈ యాప్ ద్వారా ప్రశ్నించవచ్చు. గ్రామపంచాయతీకి సంబంధించిన అభివృద్ధి, ఆర్థిక పురోగతి, ఆస్తుల నిర్వహణ, జియో ట్యాగింగ్ వివరాలను యాప్‌లో నిక్షిప్తంగా పొందుపర్చాల్సి ఉంటుంది. గ్రామ పాలకమండలి పేరుతో సహా పంచాయతీ కార్యదర్శి వివరాలు.. నిధుల మంజూరు.. ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారు? పనుల పురోగతి వంటి అంశాలు సైతం ఉంటాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా వ్యయాలు, అభివృద్ధి పనులు, నివేదికలు యాప్‌లో క్లుప్తంగా ఉంటాయి. జీపీఆర్ఎస్ ద్వారా పనులను గుర్తించడంవల్ల ఒక్కసారి చేసిన పనులకు మరోసారి బడ్జెట్ కేటాయించడానికి వీలుండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వివరాలు ఎంపిక చేసిన పనులకు ఎంత ఖర్చు చేశారు? కార్మిక వేతనాలు ఇతర ఖర్చుల వంటి సమాచారం సైతం ఇందులో పొందుపర్చుతారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బండీగా ఈ-గ్రామస్వరాజ్ యాప్ ద్వారా అమలు చేస్తున్నారు.

eGramSwaraj
Simplified Work Based Accounting Application for Panchayati Raj

అన్ని వివరాలు తెలుసుకోవచ్చు

గ్రామపంచాయతీ అభివృద్ధి, ఆస్తుల వివరాలు ఈ-గ్రామస్వరాజ్ యాప్‌తో సులభంగా తెలుసుకోవచ్చు. ప్రతి పనిని ఇందులో పొందుపర్చుతారు. కార్మిక వివరాలతో పాటు జీత భత్యాలు ఉంటాయి. ఎలాంటి తప్పులకు తావులేకుండా మూడేండ్లుగా నమోదు చేస్తున్నారు. దీనిపై ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా గ్రామపంచాయతీకి సంబంధించిన వివరాలను అడిగితే యాప్ ద్వారా తెలుసుకోవచ్చని చెబుతున్నాం.

- సంధ్య, ఎంపీడీవో, మొయినాబాద్

ఎన్నికలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో భారత ఎన్నికల సంఘం టెక్నికల్ ప్రతినిధి సౌరభ్‌రాయ్

రంగారెడ్డి, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : రానున్న లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని భారత ఎన్నికల సంఘం టెక్నికల్ ప్రతినిధి సౌరభ్‌రాయ్ సూచించారు. గురువారం వివిధ రాష్ట్రాలకు చెందిన జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సి-విజిల్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించారు. ఓటర్లను ప్రలోభాలు పెట్టినా, భయభ్రాంతులకు గురి చేసినా లేదా బలవంతంగా ప్రభావితం చేసినట్లయితే సి-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వవచ్చని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎఫ్ఎస్‌టీ టీం ద్వారా పట్టుబడిన నగదు, మద్యం, ఆభరణాలు మొదలైన వాటిపై యాప్ ద్వారా అప్‌లోడ్ చేసే అంశంపై వివరించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నామినేషన్లపై కూడా అవగాహన కలిగించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి కలెక్టర్ శశాంక, ఈఆర్‌వోలు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను వెంటనే ఎఫ్‌సీఐకి పంపాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 15 : 2022-23 సంవత్సరానికి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పౌర సరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో సీఎంఆర్ రైస్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి మాసాంతం వరకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైస్ మిల్లర్లు తమ వద్ద నిలువ ఉన్న సీఎంఆర్ రైస్‌ను 100 శాతం ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని ఆదేశించారు. పౌర సరఫరాలో డిప్యూటీ తహసీల్దార్లందరూ ప్రతిరోజూ మిల్లుల వద్దకు వెళ్లి సీఎంఆర్ డెలివరీ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన సమయంలో డెలివరీ చేయకుంటే తక్షణ చర్యలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ కొండలరావు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లుల సంఘం అధ్యక్షుడు బాలేశ్వరగుప్తా, సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండాపూర్ బెటాలియన్‌లో క్వార్టర్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా, తదితరులు

కొండాపూర్ బెటాలియన్‌లో..

రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు

శంకుస్థాపన చేసిన టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

కొండాపూర్, ఫిబ్రవరి 15 : కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్‌లో అధికారులు, సిబ్బంది కోసం నూతనంగా 19 క్వార్టర్లను నిర్మించనున్నట్లు టీఎస్ఎస్పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా అన్నారు. గురువారం బెటాలియన్‌లో ఆవరణలో రూ. 13 కోట్లతో చేపట్టిన క్వార్టర్ల నిర్మాణ పనులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ రమేశ్, డీఐజీ సిద్ధిఖీ, కమాండెంట్ సీ సన్నీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెటాలియన్‌లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బెటాలియన్‌లో మరో 19 క్వార్టర్లను అన్ని సౌకర్యాలతో నిర్మించేందుకు రూ.13 కోట్లతో పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు కె. సుబ్రహ్మణ్యం, డి. తులసీధర్, టి.ఈశ్వర్, బెటాలియన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జైన్ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్‌కు 10 లక్షల జరిమానా

తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తీర్పు

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): జైన్ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్‌పై 2022లో శ్రీనివాస్ ఇనాల తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. కమిషన్ సభ్యులు వి.వి.శేషబాబు, ఆర్.ఎస్.రాజశ్రీ చేపట్టిన విచారణ అనంతరం జైన్ హౌసింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్‌కు రూ.10 లక్షల జరిమానా విధించింది. జరిమానాతో పాటు ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షలు, మానసిక బాధకు గురిచేసినందుకు రూ.లక్షా యాభై వేలు కలిపి మొత్తం డబ్బును 30 రోజుల లోపు చెల్లించాలని కమిషన్ తీర్పు వెల్లడించింది. 2022లో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం గచ్చిబౌలిలోని ఖాజాగూడలోని జైన్స్‌కార్ల్‌టన్ క్రీక్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నం.810 ఇంటి నిర్మాణాన్ని సదరు బిల్డర్ పూర్తి చేయలేదని, ఒప్పందం ప్రకారం ఇచ్చిన సమయంలోపు నిర్మించి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చివర